క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి
ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

దండేపల్లి: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామంలో దేవాదాయ, ధర్మదాయ నిధుల తోపాటు గ్రామస్తుల విరాళాలలో నిర్మించిన శ్రీసీతారామ సహిత దాసాంజనేయ ఆలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో గ్రామస్తుల కృషి అభినందనీయమన్నారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన పూజల సందర్భంగా ఆలయం వద్ద మూడు రోజులు అన్నదాన కార్యక్రమంతోపాటు, రూ.50 వేల నగదును ఎమ్మెల్యే ఆలయ కమిటీకి అందించారు.

వైభవంగా ప్రతిష్ఠాపన పూజలు..
శ్రీసీతారామ సహిత దాసాంజనేయ విగ్రహప్రతిష్ఠాపన పూజలు వైభవంగా సాగాయి. వేద పండితులు శ్రీవేమునూరి వేంకటాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం


హోమంలో పాల్గొన్న దంపతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి పునరావాస కాలనీలో శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రారంభమైన ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వేద పండితుడు కట్టా నరసింహశాస్త్రీ స్వామిజీ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం గణపతి పూజ, విగ్రహానికి క్షీరాధి, జలాధి, ధాన్యాధి, పుష్పాధి, శయనాధివాస కార్యక్రమాలు జరగ్గా హోమాది పూజల్లో స్థానిక దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సోమవారం వివిధ ప్రత్యేక పూజలతో పాటు మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠా, శిఖర కలశం, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం, మంత్రపుష్పం, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయాల వద్ద షీటీమ్ డెకాయ్ ఆపరేషన్


యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న షీ టీమ్ ఎస్సై

మంచిర్యాలక్రైం: శ్రీరామనవమి సందర్భంగా షీటీమ్ పోలీసులు ఆలయాల వద్ద ఆదివారం డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ఆదేశాల మేరకు మహిళల భద్రత కోసం డెకాయ్ ఆపరేషన్ నిర్వహించామని షీటీమ్ ఎస్సై హైమ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గౌతమేశ్వర ఆలయం, కాలేజీ రోడ్ గోదావారికి వెళ్లే దారిలో, మఫ్టీలో తిరుగుతూ పర్యవేక్షించారు. స్పోర్ట్స్ బైకులపై చెక్కర్లు కొడుతూ మహిళలకు ఇబ్బంది కలిగించిన ఆకతాయిలను గుర్తించారు. అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైన మహిళలు ఆకతాయిల వేధింపులకు గురైతే డయల్ 100కు గానీ షీటీమ్ నంబర్ 63039 23700కు గానీ ఫోన్‌చేసి లేదా వాట్సాప్ మెస్సేజ్ ద్వారా సమాచారం ఇవ్వాలని వివరించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్సైతోపాటు సిబ్బంది సతీశ్, శ్రావణ్, జ్యోతి, శ్రీలత పాల్గొన్నారు.

రామ భక్తుల శోభాయాత్ర


ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

చెన్నూర్: పట్టణంలో శ్రీరామనవమి సందర్భంగా స్థానిక ప్రతాప్ మారుతీ మందిర్, బడా హనుమాన్ మందిర్ ఆధ్వర్యంలో రామ భక్తులు పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

శోభాయాత్ర
దండేపల్లి: దండేపల్లిలో ఆదివారం రాత్రి సీతారాముల ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ప్రజలు మంగళ హారతులతో స్వాగతం పలికి, పూజలు చేశారు. పల్లకిలో గ్రామ వీధులగుండా ఊరేగించారు. హన్మాన్ దీక్షా పరుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.


బెల్లంపల్లి: కోదండరామాలయంలో హాజరైన భక్తులు


మందమర్రిరూరల్: కల్యాణానికి హాజరైన భక్తులు


దండేపల్లి: కల్యాణం జరిపిస్తున్న పండితులు


సుద్దాలలో దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేక్


వేంపల్లిలోని శివకేశవ ఆలయ ఆవరణలో భక్తులు


లక్సెట్టిపేటలో కల్యాణం జరిపిస్తున్న పూజారులు


నస్పూర్: కల్యాణంలో డైరెక్టర్ సూర్యనారాయణ


దేవాపూర్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య


తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు




రామకృష్ణాపూర్: హాజరైన భక్తులు

రాములోరి పెళ్లి

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు
- మార్మోగిన రామనామస్మరణ


వేమనపల్లి: నీల్వాయిలో ఉత్సవ విగ్రహాలతో...

సాక్షినెట్‌వర్క్: శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఊరూరా, వాడవాడలా భక్తులు అత్యంత వైభవోపేతంగా జరిపారు. వేద బ్రాహ్మణుల వేద మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణ ఘట్టంలో భాగంగా యజ్ఞోపవేతధారణ, కన్యాధానం, జీలకర్ర-బెల్లం, మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాలు తదితర ఘట్టాలను కనుల పండువగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ఆలయాల్లో రామనామస్మరణ మార్మోగింది. కల్యాణం అనంతరం భక్తులకు వడపప్పు, బెల్లం పానకం, పులిహోర, సిరా ప్రసాదాలను పంపిణీ చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

- బెల్లంపల్లి శ్రీకోదండ రామాలయంలో, నెన్నెలలో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకలకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.
- చెన్నూర్ మండలం సుద్దాలలో, మందమర్రి శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో, భీమారం శ్రీ కోదండరామాలయంలో, రామకృష్ణాపూర్‌లో ఎమ్మెల్యే గడ్డం వివేక్ సీతారాముల దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు.
- మందమర్రిలో రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు.
- జన్నారంలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.
- మంచిర్యాల, హాజీపూర్, కాసిపేట మండలం ధర్మరావుపేట ఆలయాల్లో మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ హాజరై కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.
- జైపూర్ ఎస్టీపీపీలో రాష్ట్ర కనీస వేతన సలహాదారుల సంఘం చైర్మన్ జనక్‌ప్రసాద్, ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, ఓఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- రామకృష్ణాపూర్‌లో మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ దంపతులు సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.
- దేవాపూర్ సల్పాలవాగులో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై మొక్కులు తీర్చుకున్నారు.
- నస్పూర్ షిర్కే కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ సూర్యనారాయణ మాలతి, ఏరియా జీఎం శ్రీనివాస్ ఉమారాణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- జైపూర్ మండలం కాన్కూర్‌లో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ పాల్గొన్నారు.




మంచిర్యాలఅర్బన్: విశ్వనాథస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావ్, భక్తులు


నెన్నెలలో పూర్ణకుంభం, పట్టువస్త్రాలతో వస్తున్న ఎమ్మెల్యే


జన్నారం : రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు


కొల్లూర్‌లో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు


తాండూర్: మాదారంలో సీతారాముల కల్యాణం


ఎస్టీపీపీలో తాళిబొట్టు చూపిస్తున్న పండితుడు


జన్కాపూర్‌లో సీతారాముల కల్యాణంలో భక్తులు


పానకల్ సీతారామచంద్రస్వామి ఆలయంలో...


చెన్నూర్ పంచముఖాంజనేయ ఆలయంలో...


భీమారం: కల్యాణం జరిపిస్తున్న వేదబ్రాహ్మణులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

దండేపల్లి/నెన్నెల/తాండూర్/కోటపల్లి/బెల్లంపల్లి/మందమర్రిరూరల్/భీమారం/భీమిని/చెన్నూర్ రూరల్/రామకృష్ణాపూర్/వేమనపల్లి/మంచిర్యాల రూరల్(హాజీపూర్): భారతీయ జనతాపార్టీ (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవం ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.ఊరూరా బీజేపీ జెండాను ఎగురవేశారు. మిఠాయిలు పంచి పెట్టి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద జాతీయ పార్టీ బీజేపీ అని, బీజేపీ ప్రభుత్వం ఎల్లవేళలా దేశ దేశం కోసం, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, సీనియర్ నాయకులు కేశవ రెడ్డి, గోవర్ధన్, మోహన్, శ్రావణ్, ఆ పార్టీ 94వ బూత్ కమిటీ అధ్యక్షుడు గర్రెపల్లి రాకేష్, తాండూర్‌లో జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, హాజీపూర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, యువమోర్చ మండల అధ్యక్షుడు సురేశ్, నర్సింగాపూర్ బూత్ అధ్యక్షులు శ్రీనివాస్, తిరుపతి, రామకృష్ణాపూర్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆరుముళ్ల పోషం, పట్టణ అధ్యక్షుడు ధన్‌సింగ్, బంగారి వేణు, వేముల అశోక్, రాంకిషోర్, దండేపల్లిలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సురేందర్, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు రాకేష్, పీఏసీఎస్ డైరెక్టర్ సంతోష్, నెన్నెలలో మండల అధ్యక్షుడు అంగలి శేఖర్, కోటపల్లిలో మండల ఉపాధ్యక్షుడు పున్నం, మందమర్రిలో మండల అధ్యక్షుడు జనార్దన్, భీమారంలో జిల్లా బీజేపీ నాయకులు మాడెం శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, భీమినిలో పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లి: మాట్లాడుతున్న ఏమాజీ

బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలి

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి గ్రామంలో మృతి చెందిన పాలేరు కన్నయ్య కుటుంబాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మృతుడి కుటుంబానికి రూ.50లక్షల తక్షణ సాయం, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యజమాని చిన్నన్న, అతడి భార్య లక్ష్మి దుర్భాషలాడడంతోనే కన్నయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బోడంకి చందు, జిల్లా కమిటీ సభ్యులు ఉమారాణి, నాయకులు ముడిమడుగుల బ్రహ్మయ్య, ఎర్మ పున్నం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, మల్లీశ్వరి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

పేకాటస్థావరంపై పోలీసుల దాడులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ శివారులో బహిరంగ ప్రదేశంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తిలక్‌నగర్‌కు చెందిన గోదార్ల రమేశ్, దేవుసాని కుమార్, ఆటకారి శ్రీను, వనం లక్ష్మణ్, మాచర్ల వెంకటేశ్, తోకల శ్రీనివాస్, గౌరి ప్రసాద్‌లు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో క్రైంపార్టీ సిబ్బందితో ఆకస్మికంగా దాడులు చేసి వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2100 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో మత సామరస్యం వెల్లివిరిసింది. కాంట్రాక్టర్ బస్తీలోని పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హన్మాన్ మాల ధరించిన భక్తులకు ముస్లింలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అన్నదానం (బిక్ష) పెట్టారు. సీరాజ్, మిరాజ్, ఎండీ.హనీఫ్‌లు స్వయంగా హన్మాన్ భక్తులకు మతాలకు అతీతంగా భోజనం వడ్డించి హిందూ, ముస్లింల ఐక్యతను చాటారు. కార్యక్రమంలో హన్మాన్ భక్తులు లక్ష్మణ్‌రావు, ప్రభాకర్, రాజశేఖర్, రామకృష్ణ, మురళీ, కుంబాల రాజేష్, సంతోష్, దెబ్బెటి రమేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్ చిత్రపటానికి క్షీరాభిషేకం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ చిత్రపటానికి క్షీరాభిషే కం చేశారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగానే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణపు పనులు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, వొడ్నాల శ్రీనివాస్, గాండ్ల సమ్మయ్య, యాకూబ్‌అలీ, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

8న ఆపరేషన్ కగార్ వ్యతిరేక ధర్నా

జన్నారం/నెన్నెల: కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న మారణకాండ ఆపాలని ఈ నెల 8న ఇందిరా పార్కు ఎదుట భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా తలపెట్టినట్లు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఏరియా కార్యదర్శి దొంద ప్రభాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి తెలిపారు. ధర్నాకు సంబంధించిన పోస్టర్లను జన్నారం మండలం తలమలలో, నెన్నెల మండలం గుండ్ల సోమారంలో ఆదివారం వేర్వేరుగా ఆవిష్కరించారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సూరు పటేల్, మెస్రం చిత్రు, కుసం లచ్చన్న, సోము, జంగు ఏఐకేఎంఎస్ నాయకులు దుగుటరెడ్డి, బాపు, మల్లేశ్, లింగన్న, లక్ష్మి, మల్లీశ్వరి, చరణ్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

జార్జిరెడ్డి వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలని ముద్రించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. జార్జిరెడ్డి అమరత్వాన్ని స్మరించుకుంటూ ఆశయసాధనకు, పోరాటాలకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికందర్, సభ్యులు శశికుమార్, సిద్దార్థ, వంశీ, అనిల్ పాల్గొన్నారు.



గుంతలు పూడ్చివేత

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా సాయిబాబా ఆలయం నుంచి ప్రగతి స్టేడియానికి వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలను అరుణక్కనగర్‌కు చెందిన ఏల్పుల రవీందర్ తన సొంత ఖర్చులు రూ.45,000తో పూడ్చి వేయించారు.